విశాఖపట్టణం
సోమవారం 28 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 227 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## జనగణన ప్రతి ఒక్కరి బాధ్యత



### మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

2

# ఆ 10.2 కోట్ల ఓటర్ల సంగతేంటి..?

### ఈసీ ప్రకటనపై కాంగ్రెస్ ఆగ్రహం

### ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ పార్టీ ధ్వజం

### ఎస్ఐఆర్ చుట్టూ ముదురుతున్న వివాదం






(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వ్యవహారంపై కాంగ్రెస్, ఎన్నికల సంఘం మధ్య వివాదం మరింత ముదురుతోంది. సర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రకటించిన అరకొర చర్యలు సమస్యకు పరిష్కారం కాదని, ఇప్పటికే జరిగిన పరిణామాలపై నష్ట నివారణ ప్రయత్నమేనని (డ్యామేజ్ కంట్రోల్) కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. శుక్రవారం రాత్రి విడుదల చేసిన పత్రికా ప్రకటన తన తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికి చేసిన వృథా ప్రయత్నం అని స్పష్టం చేసింది. పాక్షికంగా చేసే దిద్దుబాటు చర్యల వల్ల లక్షలాది మంది ఓటర్ల హక్కులను కాలరాస్తున్నారని ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ విమర్శించారు. ఓటర్ల తొలగింపుపై ఈసీ అనుసరిస్తున్న విధానాలు పౌరుల ..మిగతా 2లో




## నేటి నుంచి బ్యాంకుల సమ్మె

### మూడు రోజుల పాటు బ్యాంకు సేవల నిలిపివేత

### ఏటీఎంలలో విత్ డ్రా చేసుకోవచ్చు

### యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్ సేవలు యథాతథం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

యూనైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్.. సెప్టెంబర్ 28 నుంచి సెప్టెంబర్ 30 వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ మూడు రోజుల పాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు మూతబడనున్నాయి. దీంతో ఖాతాదారుల ఆర్థిక లావాదేవీలపై ఎలాంటి ప్రభావం పడుతుందనే దానిపై సర్వత్రా ఆందోళన నెలకొంది. బ్యాంకులు మాత్రమే మూసివేస్తారా? లేక యూపీఐ, ఏటీఎంలు కూడా ఆగిపోతాయా? అనే సందేహాలకు సమాధానాలు తెలుసుకుందాం.

**సమ్మె ఎప్పుడు?**

బ్యాంకు యూనియన్ల ప్రకారం.. సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో సమ్మె కొనసాగనుంది. ఈ మూడు రోజులు బ్యాంకు శాఖలు పూర్తిగా వేయనున్నారు. మీకు ఏదైనా అత్యవసర బ్యాంకు పనుల కోసం బ్రాంచ్‌ను సందర్శించాల్సి వస్తే ఇబ్బందులు ఎదురుకావచ్చు. బ్యాంకు సమ్మె కారణంగా యూపీఐ సేవలు ఎక్కడా నిలిచిపోవు. యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ..మిగతా 2లో

# 12 నుంచి బ్రహ్మోత్సవాలు

### మూడేళ్లకోసారి అధికమాస కన్యకామాస ఉత్సవాలు

### వాహన సేవలకు బ్రహ్మోత్సవ విశిష్టత

(తిరుమల - జయజయహే)

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకోసారి అధికమాసం వస్తుంది. ఇలావచ్చిన సందర్భాల్లో కన్యామాసం(భాద్రపదం)లో వార్షిక బ్రహ్మోత్సవాలు, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం) నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, పెద్ద రథం, ధ్వజావరోహణం ఉండవు. ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ రాత్రి 6.30 నుండి 11.30 గంటల వరకు జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వైశిష్ట్యం ఇలా ఉంది.

**వాహన సేవల వివరాలు**

అక్టోబరు 11 -- అంకురార్పణం -- రాత్రి 7 నుండి 9 గంటల వరకు

అక్టోబరు 12 -- బంగారు తిరుచ్చి ఉత్సవం -- ఉదయం 9 గంటలకు ..మిగతా 2లో



## ఇక 30 రోజుల వ్యాలిడిటీతో ప్లాన్లు

### వాయిస్, ఎస్ ఎం ఎస్ ప్లాన్లు తేవాల్సిందే

### టెలికాం సంస్థలకు ట్రాయ్ ఆదేశాలు

### వెల్లడించిన ఎంపీ రాఘవ్ చద్దా

2






## గ్లోబల్ సిటీల్లో మన నగరాలు

### గుంటూరు, విశాఖ, నెల్లూరు, విజయవాడలకు ర్యాంకులు

### అంతర్జాతీయ వెయ్యి నగరాల్లో రాష్ట్రంలోని నాలుగు సిటీలకు చోటు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

వేగవంతమైన ఆర్థిక పురోగతి (ఎమర్జింగ్ స్టాండ్ ఔట్స్)ని సాధిస్తున్న నగరాల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాలుగు నగరాలు చోటు దక్కించుకున్నాయి. ఆక్స్‌ఫర్డ్ ఎకనమిక్స్ సంస్థ తాజాగా 1,000 అంతర్జాతీయ నగరాల సూచీతో 'గ్లోబల్ సిటీస్ ఇండెక్స్--2026' నివేదిక విడుదల చేసింది. ఇందులో గుంటూరు, విశాఖపట్నం, నెల్లూరు, విజయవాడ ..మిగతా 2లో

### నవంబర్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల

## ఛలో అసెంబ్లీ

### ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం

### నవంబర్‌లో 3.5 లక్షల మందితో రాష్ట్రవ్యాప్త మహా ఉద్యమం

### ఏపీ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ జేఏసీ రాయలసీమ రణభేరి సదస్సు హెచ్చరిక




(తిరుపతి, జయ జయహే ):

గత రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలకు వినతులు సమర్పిస్తూ, నిరీక్షిస్తూ వచ్చారని, ఇకపై హక్కుల సాధన కోసం ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని ఏపీ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ జేఏసీ ప్రకటించింది. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే నవంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 3.5 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను సమీకరించి 'ఛలో అసెంబ్లీ'తో పాటు భారీ ఉద్యమానికి సిద్ధమవుతామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. జేఏసీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రాంతీయ సదస్సుల్లో ..మిగతా 2లో

## మరో ఐదు ప్రతిపాదనలు చెప్తా..!

### 30న విశాఖలో మరిన్ని విషయాలు ప్రకటిస్తా

### మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడి

(హైదరాబాద్ - జయజయహే)



విశాఖపట్నంలో ఈనెల 30వ తేదీన మీడియా సమావేశం ఏర్పాటు చేస్తానని మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాల గురించి మాట్లాడతానని పేర్కొన్నారు. తన ప్రెస్‌మీట్‌కు మీడియా మిత్రులు రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు ఎక్స్(శ)లో ఆయన పోస్టు పెట్టారు. రెండు కుటుంబ రాజకీయ పార్టీలతో ఏపీకి నష్టమే తప్ప.. ఎలాంటి లాభం లేదని చెప్పుకొచ్చారు. ఇందుకు సంబంధించిన మరికొన్ని ఆధారాలను ఈ నెల 30వ తేదీన ఉదయం ..మిగతా 2లో

# ఆ 10.2 కోట్ల ఓటర్ల సంగతేంటి..?

మొదటి పేజీ తరువాయి...

ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రతిపాదించిన చర్యలు- సర్ ప్రక్రియలో సమస్యలు ఉన్నాయనే విషయాన్ని పరోక్షంగా అంగీకరించినట్లేనని ఆయన అన్నారు. కొద్ది మంది ఓటర్లకు ఉపశమనం కలిగించేలా తీసుకుంటున్న చర్యలు- భారీ స్థాయిలో జరిగిన ఓటర్ల తొలగింపును సరిచేయలేవని వ్యాఖ్యానించారు.

ఎన్నికల కమిషన్ జారీ చేసిన క్లారిఫికేషన్‌ను తోసిపుచ్చుతూ జైరాం రమేశ్ పలు అంశాల్ని లేవనెత్తారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముప్పులో ఉన్న 5.43 కోట్ల మంది ఓటర్ల ఇళ్లకు బూత్ లెవెల్ అధికారులు వెళ్తారని ఎన్నికల సంఘం చెప్పడం విడ్డూరంగా ఉందని, మొదటి దశలోనే నిబంధనలు సరిగ్గా అమలు కాలేదని, అప్పుడే సరిగా జరగని ఇళ్ల సర్వేను మళ్లీ చేస్తామనడంలో అర్థమే లేదని విమర్శించారు. ఇదే సమయంలో అర్హులైన ఓటర్లను అక్రమంగా తొలగించడానికి ఈసీఐ నెట్ సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించారని ఆరోపించారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఈఎఫ్ ఓ తీసుకున్న నిర్ణయాల్ని ఈసీఐ నెట్ ద్వారా మార్చి, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించారని అంటున్నారు. ఓటర్ల జాబితా తయారీలో ఏఐ వినియోగంపై కూడా కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో సర్ ప్రక్రియ సమయంలో కొందరు ఓటర్లకు వచ్చిన నోటీసులు సిస్టమ్ జనరేటెడ్ అని ఢిల్లీ సీఈఓ వివరణ ఇచ్చారని రమేశ్ పేర్కొన్నారు. బంగాల్‌లోనూ ఏఐ వినియోగంపై మాట్లాడారని చెప్పిన ఆయన, ఇదే



సమయంలో ఈసీ మాత్రం సర్ ప్రక్రియలో ఏఐ వినియోగించట్లేదని చెప్పిందని గుర్తుచేశారు. ఈ రెండు వాదనల మధ్య ఈసీ నుంచి స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఇక సర్‌పై కాంగ్రెస్ విమర్శలకు బీజేపీ కూడా ఘాటుగా స్పందించింది. సర్ ద్వారా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కలిపి 2.8 కోట్ల మంది మృతుల ఓటర్ల పేర్లను, కోటికిపైగా డూప్లికేట్ ఎంట్రీలను తొలగించామని బీజేపీ పేర్కొంది. ఇదే సమయంలో 9.43 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు మారిన ఓటరు పేర్లను గుర్తించి తొలగించినట్లు తెలిపింది. దీనిపై కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం చీఫ్ పవన్ ఖేడా స్పందించారు. మొత్తం తొలగించిన ఓట్లలో 2.8 కోట్ల మంది మరణించినవారైతే, మిగతా 10.2 కోట్ల మంది ఓటర్ల పరిస్థితి ఏంటి? అని ప్రశ్నించారు. 2014 నుంచి ఏటా జరుగుతున్న సవరణల్లో ఇంత పెద్ద సంఖ్యలో మృతుల పేర్లను ఎలా కొనసాగించారని మండిపడ్డారు. ఇలా కాంగ్రెస్, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి.

**దళిత- ఆదివాసీ ఆత్మగౌరవ సభ**

మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం- దళిత, గిరిజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో మండిపడింది. ఉత్తరాఖండ్ హల్ద్వానీలో గత నెలలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ అనంతరం అక్కడి మైదానంలో కొందరు శుద్ధీకరణ నిర్వహించడంపై పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే ఈ ఘటన ఖర్గే ఒక్కరికే కాకుండా, దళిత, గిరిజన సమాజం మొత్తానికి జరిగిన అవమానంగా భావిస్తూ సెప్టెంబర్ 29న ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో దళిత- ఆదివాసీ ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వెల్లడించారు. ఈ సభలోనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల ఉల్లంఘనలపై చర్చించనున్నట్లు తెలిపారు.

# జనగణన ప్రతి ఒక్కరి బాధ్యత

## మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**



ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని తెలిపారు. ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందనే విషయాన్ని భారత్ స్పష్టం చేసిందని తెలిపారు. 2016 పాకిస్థాన్‌లో ఉగ్రశిబిరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ అందుకు నిదర్శనమని అని అన్నారు. గాంధీ జయంతి వేళ స్వచ్ఛతకు సంబంధించి ఆయన ఇచ్చిన నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని మోదీ, ప్రజలను కోరారు. 138వ 'మన్ కీ బాత్'లో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు. భారత సైనికులు నియంత్రణ రేఖ దాటి ఉగ్రవాద స్థావరాలపై చర్యలు చేపట్టడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని మోదీ అన్నారు. దేశం చాలా కాలంగా ఉగ్రదాడుల వల్ల ఎదుర్కొన్న బాధకు ఈ చర్య నిర్ణయాత్మక ప్రతిస్పందనగా నిలిచిందని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం 2016లో చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్ ప్రపంచం ముందు భారత్ ఉగ్రవాద వ్యతిరేక విధానానికి ఒక కొత్త ఉదాహరణగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్ 18న జమ్ముకశ్మీర్‌లోని ఉరీలో ఆర్మీ శిబిరంపై ఉగ్రదాడి జరిగింది. ఈ దాడికి ప్రతిస్పందనగా సెప్టెంబర్ 28-29 రాత్రి నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల లాంచ్ ప్యాడ్‌లపై భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది.

**జనగణనపై ప్రజలకు పిలుపు**

మన్ కీ బాత్'లో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రక్రియను కూడా ప్రధాని ప్రస్తావించారు. జనగణనను జాతీయ బాధ్యతగా అభివర్ణించారు. ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని కోరారు. జనగణన సమయంలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. దేశ జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

**డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత**

దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు యువత ముందుకు రావడాన్ని ప్రధాని ప్రశంసించారు. 'నషా ముక్త్ యువ అభియాన్' ద్వారా యువత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. యువత తమంతట తామే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారని మోదీ చెప్పారు. 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో దేశవ్యాప్తంగా యువత భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది.

**మోఢేరా గ్రామం ప్రస్తావన**

గుజరాత్‌లోని చారిత్రాత్మక మోఢేరా సూర్య దేవాలయం వెయ్యేళ్ల ప్రస్థానాన్ని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. విదేశీ దండయాత్రల సమయంలో ఈ ఆలయం ఎదుర్కొన్న విధ్వంసాన్ని, ఆ తర్వాత జరిగిన పునర్నిర్మాణాన్ని గుర్తుచేసుకున్నారు. అదే సమయంలో, ఈ గ్రామం దేశంలోనే మొట్టమొదటి 24ఇ7 సోలార్ విలేజ్‌గా మారడాన్ని ఆయన అభినందించారు. అలాగే మోఢేరాలో పర్యాటకుల కోసం అనేక వసతులను పెంచినట్లు ప్రధాని తెలిపారు. ఏటా జనవరిలో మకర సంక్రాంతి తర్వాత ఇక్కడ జరిగే 'మోఢేరా నృత్య ఉత్సవం'లో భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. భారతీయులందరూ జీవితంలో ఒక్కసారైనా మోఢేరాను సందర్శించాలని ఆయన కోరారు.

మధ్యప్రదేశ్‌లో ఓ యువకుడు నది పరిశుభ్రత చేపడితే సమాజం మొత్తం అండగా నిలిచిందని ప్రధాని మోదీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పురాతన బావులు, కోనేరులకు పునర్ వైభవం తీసుకొచ్చే దిశగా పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఢిల్లీలో యువత పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జనగణన కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని ప్రతి పౌరుడు అందులో పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.

**అశోక్ సింఘాల్‌కు నివాళి**

విశ్వ హిందూ పరిషత్ మాజీ నేత అశోక్ సింఘాల్ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనను స్మరించుకున్నారు. సమాజంలో ఉంటూనే సన్యాసిలా జీవితం గడిపారని పేర్కొన్నారు. రామజన్మభూమి ఉద్యమానికి సింఘాల్ అందించిన దిశ, అందులో ఆయన నింపిన శక్తిని మోదీ ప్రస్తావించారు. అయోధ్యలో నిర్మితమైన రామ మందిరాన్ని ఆయన కృషికి ఫలితంగా అభివర్ణించారు.

# మరో ఐదు ప్రతిపాదనలు చెప్తా..!

మొదటి పేజీ తరువాయి...

11 గంటలకు, వైజాగ్ దస్‌పల్లా హోటల్ వేదికగా వివరిస్తానని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయం, నేటి రాజకీయాల్లో తెరవెనుక పొత్తులు, గిరిజనులే టార్గెట్‌గా జరుగుతున్న మత మార్పిడులు వంటి విషయాల మీద ఈ ప్రెస్‌మీట్‌లో మాట్లాడతానని తెలిపారు. ఇంతకు ముందు విజయవాడ, అనంతపురం ప్రెస్‌మీట్ల ద్వారా రాష్ట్ర ప్రజల ముందు 10 ప్రతిపాదనలు ఉంచానని ప్రస్తావించారు. మరో 5 ప్రతిపాదనలతో విశాఖపట్టణంలో మీ ముందుకు వస్తానని చెప్పుకొచ్చారు. ఏపీ ప్రజా ప్రయోజనాల కోసం వైజాగ్ మీడియా ప్రతినిధులంతా ఈ ప్రెస్‌మీట్ లైవ్ కవరేజికి రావాలని విజయసాయిరెడ్డి ఆహ్వానం పలికారు.

# గ్లోబల్ సిటీల్లో మన నగరాలు

మొదటి పేజీ తరువాయి...

నగరాలు ఎమర్జింగ్ స్టాండ్‌ఔట్స్ విభాగంలో గుర్తింపు పొందాయి. ప్రపంచవ్యాప్తంగా వెయ్యి నగరాలను పరిశీలించి రూపొందించిన ఈ సూచీలో రాష్ట్ర నగరాలు తమ ప్రత్యేక స్థానాన్ని సంపాదించడం విశేషంగా నిలిచింది. నివేదిక ప్రకారం గుంటూరు (739), విశాఖపట్నం (755), నెల్లూరు (893), విజయవాడ (932) ర్యాంకుల్లో నిలిచాయి. నగరాల ఆర్థిక వ్యవస్థ, మానవ వనరులు, జీవన ప్రమాణాలు, పర్యావరణం, పాలన అనే ఐదు కీలక అంశాల్ని పరిశీలించి ర్యాంకింగ్‌లు ప్రకటించారు. వేగవంతమైన అభివృద్ధితో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. జీడీపీ వృద్ధి, ఉపాధి కల్పన, టెక్నాలజీ, ఇన్నోవేషన్ వంటి తదితర విభాగాల్లో ప్రపంచ సగటు కంటే మెరుగైన పనితీరు కనబరుస్తున్న నగరాలకు ఈ విభాగంలో చోటు కల్పించినట్లు ఆక్స్‌ఫర్డ్ ఎకనమిక్స్ వెల్లడించింది. అంతర్జాతీయ నగరాల ర్యాంకింగ్‌లో న్యూయార్క్ తొలి స్థానంలో నిలవగా, లండన్ రెండో, పారిస్ మూడో స్థానాల్లో ఉన్నాయి. భారత్ నుంచి ఢిల్లీ 268వ స్థానంలో చోటు దక్కించుకోగా, బెంగళూరు 311వ స్థానంలో, ముంబయి 330వ స్థానంలో, చెన్నై 381వ స్థానంలో, హైదరాబాద్ 421వ స్థానాల్లో నిలిచాయి. పుణె (427), త్రిసూర్ (477), కొచ్చి (489), కోల్‌కతా (496), కోజికోడ్ (499) తదితర నగరాలు కూడా జాబితాలో చోటు దక్కించుకున్నాయి. 2050 నాటికి భారత నగరాలదే జోరు: 2050 నాటికి ఆర్థిక, వ్యాపార సేవల వృద్ధిలో భారత నగరాలు ప్రపంచంలోనే ముందంజలో ఉంటాయని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా బెంగళూరు అంతర్జాతీయ టెక్‌హబ్‌గా నిలిచింది. ఆసియా నగరాలే ప్రపంచ ఆర్థిక వృద్ధికి ప్రధాన చోదకశక్తిగా మారుతున్నాయని నివేదిక వెల్లడించింది. భారీ జనాభా, పెరుగుతున్న ఉత్పాదకతతో పాటు, గణనీయంగా పెరిగిన ఆదాయ స్థాయులే భారత్, చైనాల్ని ముందు వరుసలో నిలిచేలా చేస్తున్నాయని తెలిపింది. విలువ ఆధారిత రంగాలపై దృష్టి: అధిక ఉత్పాదకత, అధిక వేతనలతో కూడిన ఉద్యోగాలు లభించాలంటే నగరాలు విలువ ఆధారిత రంగాలపై దృష్టి సారించాలని నివేదిక సూచించింది. నైపుణ్యం కలిగిన వారిని ఆకర్షించడంతో పాటు స్థానిక విద్యానైపుణ్యాలను ప్రోత్సహించడం వల్ల మానవ వనరుల సంపద పెరుగుతుందని వివరించింది. తద్వారా మరిన్ని పెట్టుబడులును ఆకర్షిస్తూ ఆర్థికవృద్ధి మరింత వేగవంతమవుతుందని నివేదిక స్పష్టం చేసింది. చైనా, భారత్ నగరాల జీడీపీ వాటా 2050 నాటికి యూరప్ నగరాల వాటాను అధిగమించే అవకాశముందని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాలుగు నగరాలకు లభించిన గుర్తింపు రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి సామర్థ్యానికి మరో నిదర్శనంగా నిలిచింది.

# ఇక 30 రోజుల వ్యాలిడిటీతో ప్లాన్లు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

మొబైల్ ప్రీపెయిడ్ వినియోగదారులకు ట్రాయ గుడ్ న్యూస్ చెప్పింది. 30 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్లు, అలాగే వాయిస్ ం ఎస్ ఎం ఎస్ మాత్రమే ఉండే ప్లాన్లు అందుబాటులోకి తీసుకురావాలని టెలికాం కంపెనీలను ట్రాయ్ ఆదేశించింది. టెలికాం వినియోగదారుల సెక్యూరిటీ (13వ సవరణ) నిబంధనలు, 2026ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎంపీ రాఘవ్ చద్దా వెల్లడించారు. ఈ కొత్త నిబంధనల ద్వారా వినియోగదారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. గతంలో నెలవారీ రీఛార్జ్ పేరుతో వినియోగదారులు ఏడాదికి 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ఇకపై ఆ సమస్య ఉండదని రాఘవ్ చద్దా తెలిపారు. ట్రాయ్ కొత్త నిబంధనలతో 30 రోజుల రీఛార్జ్ ప్లాన్‌లు అందుబాటులోకి రావడంతో, ఇకపై వినియోగదారులు సంవత్సరానికి 13 సార్లు కాకుండా కేవలం 12 సార్లు మాత్రమే రీఛార్జ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంటర్నెట్ లేదా డేటా అవసరం లేకుండా కేవలం కాల్స్ మాత్రమే కోరుకునే కస్టమర్ల కోసం ప్రత్యేకంగా వాయిస్ ఓన్లీ ప్లాన్‌లను ప్రవేశపెట్టాలని ట్రాయ్‌ని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ ప్లాన్లలో ఇన్‌కమింగ్ అవుట్‌గోయింగ్ సేవలు రెండూ అందుబాటులో ఉంటాయని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు, బడ్జెట్‌లో ఉండే మొబైల్ యూజర్లకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పరిమితమైన రీఛార్జ్ ఎంపికలపై ప్రజల నుంచి వచ్చిన ఆందోళనలను తాను మార్చి 11న పార్లమెంట్‌లో లేవనెత్తానని రాఘవ్ చద్దా తెలిపారు. ప్రజల డిమాండ్లను నెరవేర్చిన కేంద్ర ప్రభుత్వానికి, ట్రాయ్‌కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్మాణాత్మక రాజకీయాలకు ఇదొక గొప్ప నిదర్శనమని ఆయన అన్నారు.



# నవంబర్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఛలో అసెంబ్లీ

మొదటి పేజీ తరువాయి...

భాగంగా ఆదివారం తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో రాయలసీమ రణభేరి సదస్సు ఆదివారం ఘనంగా జరిగింది. తిరుపతి జిల్లా జేఏసీ చైర్మన్ జి. నాగవెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సులో శాసనమండలి మాజీ ప్రొటెం స్పీకర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జేఏసీ గౌరవాధ్యక్షులు ఏ.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా పేరుకుపోయాయని పేర్కొన్నారు. తక్కువ వేతనాలతో ప్రభుత్వ శాఖల్లో కీలకమైన సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, సంక్షేమ పథకాలు, క్రమబద్ధీకరణ వంటి అంశాల్లో న్యాయం జరగడం లేదని విమర్శించారు. రూ.7 వేల నుంచి రూ.8 వేల వంటి అతి తక్కువ వేతనాలతో పనిచేసే ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ కొన్ని సంక్షేమ పథకాల నుంచి దూరం చేయడం అన్యాయమని వారు పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీవన పరిస్థితులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 2న విశాఖపట్నంలో సత్యాగ్రహ దీక్ష, అక్టోబర్ 4న రాజమండ్రిలో మహాగర్జన సదస్సు నిర్వహించి, అనంతరం రాష్ట్రవ్యాప్త పోరాటానికి ఉద్యోగులను సమాయత్తం చేయాలని నిర్ణయించారు. జేఏసీ రాష్ట్ర చైర్మన్ బి. కాంతారావు మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రితో ఉద్యోగ సంఘాల సమావేశంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు తగిన ప్రాధాన్యం లభించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న తమను విస్మరించడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. "ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదు. ఇక వినతిపత్రాలతో మాత్రమే సరిపెట్టుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెతో సహా మరింత విస్తృతమైన ఉద్యమాలకు సిద్ధమవుతాం" అని ఆయన హెచ్చరించారు. జేఏసీ జనరల్ సెక్రటరీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ పోరాటాల ద్వారానే గతంలో వేతనాల పెంపు, ఇతర కొన్ని సౌకర్యాలను సాధించుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత, సమాన వేతనం కోసం మరింత ఐక్యంగా, రాజీలేని పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఇతర కార్మిక వర్గాలతో కలిసి విస్తృత ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగ భద్రతతో పాటు ప్రజల ప్రయోజనాలపైనా ప్రభావం పడుతుందని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దయామణి మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా శాఖలు, సంఘాలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు చినబాబు, సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర, రాష్ట్ర నాయకులు రవిప్రకాశ్, అప్పారావు తదితరులు ప్రసంగించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 12 నుంచి బ్రహ్మోత్సవాలు

మొదటి పేజీ తరువాయి...

పెద్దశేష వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 13 -- చిన్నశేష వాహనం -- ఉదయం 8 గంటలకు
హంస వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 14 -- సింహ వాహనం -- ఉదయం 8 గంటలకు
ముత్యపుపందిరి వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 15 -- కల్పవృక్ష వాహనం -- ఉదయం 8 గంటలకు
సర్వభూపాల వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 16 -- మోహినీ అవతారం -- ఉదయం 8 గంటలకు
గరుడ వాహనం -- సాయంత్రం 6.30 గంటలకు
అక్టోబరు 17 -- హనుమంత వాహనం -- ఉదయం 8 గంటలకు
పుష్పక విమానం -- సాయంత్రం 4 గంటలకు
గజ వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 18 -- సూర్యప్రభ వాహనం -- ఉదయం 8 గంటలకు
చంద్రప్రభ వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 19 -- స్వర్ణరథం -- ఉదయం 7 గంటలకు
అశ్వ వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 20 -- చక్రస్నానం -- ఉదయం 6 గంటలకు

# నేటి నుంచి బ్యాంకుల సమ్మె

మొదటి పేజీ తరువాయి...

వంటి డిజిటల్ సేవలు యథావిధిగా కొనసాగుతాయి. వినియోగదారులు యూపీఐ ద్వారా డబ్బు పంపడం,ఞ= కోడ్ చెల్లింపులు, ఆన్‌లైన్ పేమెంట్స్ వంటివి ఎలాంటి అంతరాయం లేకుండా చేసుకోవచ్చు. అయితే, సర్వర్ సమస్యలు లేదా సాంకేతిక లోపాలు తలెత్తే అవకాశం ఉండడంతో, అత్యవసర చెల్లింపులను చివరి నిమిషం వరకు వాయిదా వేయకపోవడమే మంచిది.

**ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రా**

ఏటీఎం సేవలు సాధారణంగానే పనిచేస్తాయి. సమ్మె సమయంలో ఏటీఎంలు, బీసీ పాయింట్లు, ఇతర సౌకర్యాలను ఉపయోగించుకోవాలని బ్యాంకులు సూచించాయి. అయితే కొన్ని ఏటీఎంలలో నగదు లేకపోవడం, టెక్నికల్ సమస్యలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి, ముందే తగినంత నగదు చేతిలో ఉంచుకోవడం మంచిదని బ్యాంకులు సూచిస్తున్నాయి. బ్యాంకు కౌంటర్లలో నగదు జమ చేయడం లేదా విత్ డ్రా, చెక్కుల క్లియరెన్స్ , కేవైసీ ప్రక్రియలు, డాక్యుమెంట్ల సబ్‌మిట్ చేయడం, బ్రాంచ్ కౌంటర్ల ద్వారా జరిగే ఇతర వ్యక్తిగత సేవలు ఈ మూడు రోజులు నిలిచిపోనున్నాయి.

# నవయుగ కవిచక్రవర్తికి నీరాజనాలు

**విశాఖపట్నం (జయ జయహే)**

తెలుగు దండు మరియు పరవస్తు పద్యపీఠం ఆధ్వర్యంలో.. "నవయుగ కవి చక్రవర్తి", గుర్రం జాషువా 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మద్దిలపాలెం కూడలి, తెలుగుతల్లి విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కవులు,కళాకారులు, సాహితీవేత్తలు, రచయితలు, భాషాభిమానులు పాల్గొని విశ్వకవికి నీరాజనాలు సమర్పించారు. ముందుగా తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించిన తెలుగు భాషాభిమానులు, తదుపరి గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి, నీరాజనాలు అర్పించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జివిఎంసి అడిషనల్ కమీషనర్ పల్లి నల్లనయ్య ప్రసంగిస్తూ జాషువా తన జీవితానుభవాలు నుండి పద్యకవిత్వాన్ని సృజించారని చెబుతూ, జాషువా రచించిన, శ్మశాన వాటిక పద్యమైన, "ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము నిప్పులలోన



కరగిపోయె" పద్యాన్ని అద్భుతంగా పాడి వినిపించారు. తెలుగు దండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ..జాషువా కవిత్వాన్ని "సాలగ్రామ శిలా వైభవంతో పోలికచేస్తూ తెలుగు భాష ప్రగతి పథంలో ఉన్నప్పుడే జాషువా ఆత్మ శాంతిస్తుందని, ఆయన కవితాశక్తి యువతకు అందుతుందని తెలియ జేసారు. ఈ సందర్భంగా సూరి కూటమి ప్రభుత్వానికి మనవి చేస్తూ ఈ సంవత్సరమైనా "నవంబరు-1" ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని తప్పకుండా కొనసాగించాలని ముఖ్యమంత్రికి మనవి చేశారు. కళారత్న డి. వి. సూర్యారావు ఉపన్యిసిస్తూ, అణగారిన వర్గాల బాధను జాషువా తన కవిత్వం ద్వారా సమాజానికి తెలియ జేశారన్నారు. ఈ కార్యక్రమంలో డా. కె. వి. యస్. మూర్తి, జాలాది విజయ, అడపా రామకృష్ణ, డా. మరడాన సుబ్బారావు, రవిమోహన్, శివాజీ, పరమేశ్వరరావు, సిహెచ్ చిన సూర్యనారాయణ, మోహనరావు, రాజమన్నార్,మదర్ ఇండియా మాధవీ, తదితరులు పాల్గొన్నారు



## మామిడిపల్లిలో అభయపై అవగాహన సదస్సు

**గ్రామస్తులు శ్రమదానంతో రోడ్డు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్**

**దేవరాపల్లి, సెప్టెంబర్ 27, జయ జయహే**

మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఎస్ఐ వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం అభయ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభయ కార్యక్రమం మహిళల చట్టాలపై గ్రామస్తులకు వివరించారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. గ్రామస్తులు అందరూ కలిసి ఊరంతా శ్రమదానం ద్వారా రోడ్డుకి ఇరువైపులా శుభ్రపరచడం జరిగింది. అలాగే అవసరమైన చోట జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పుష్కరిని అభివృద్ధికి లక్ష విరాళం

**చోడవరం సెప్టెంబర్ 27 జయ జయహే**

చోడవరం లో 800 ఏళ్ళ నాటి పురాతన స్వయంభూ శివాలయం,పుష్కరణి అభివృద్ధి కోసం శ్రీ నిర్మల నృత్య నికేతన్ లో నృత్యం నేర్చుకుంటున్న ఈ108 మంది, 108 "నృత్త కారణాలను... ఒకేసారి ప్రదర్శించడం ద్వారా విరాళాలు సేకరించి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఈ ప్రదర్శన కు చోడవరం ఎమ్మెల్యే రాజు స్పందించి 50, 000 రూపాయలు వారికి అందజేశారు.ఈ 108 మంది తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించారు. ఆ ధ్రువపత్రాలను చోడవరం శాసన సభ్యులు కె ఎస్ ఎన్ ఎస్ రాజు చేతుల మీదుగా తీసుకున్నారు.



## రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్

**ఆరిలోవ (జయ జయహే)**

ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఎలాంటి నేరపూరిత చర్యలకు పాల్పడినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరిగి నేరాలకు పాల్పడే వారిపై 'పీడీ యాక్ట్', పిట్ ఎన్టీపీఎస్ యాక్ట్ ప్రయోగిస్తామని స్పష్టం చేశారు



## సద్భావ టీమ్ ఆధ్వర్యంలో 500 మొక్కల పంపిణీ

**చోడవరం, సెప్టెంబర్ 27 జయ జయహే**

పర్యావరణ పరిరక్షణ దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకొని ఆదివారం సి డి విఎం కమ్యూనిటీ ఫౌండేషన్ సద్భావ టీమ్ ఆధ్వర్యంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా 500 మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. వాటిలోతైవాన్ జామ, నిమ్మ మొక్కలు ఉన్నాయి.స్థానిక స్వయంభూ వినాయక ఆలయ సమీపంలో ఉన్న 'కమ్యూనిటీ ఫ్రిడ్జ్' ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంత ప్రజలకు, పర్యావరణ ప్రేమికులకు తైవాన్ జామ నిమ్మ మొక్కలను ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించడం, కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. సమృద్ధిగా మొక్కలు నాటడం ద్వారానే భావి తరాలకు స్వచ్ఛమైన గాలిని, పరిసరాన్ని అందించగలమని తెలిపారు. ఈ కార్యక్రమానికి అవసరమైన మొక్కలను అందించి పూర్తి సహకారాన్ని అందించిన అటవీ శాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సద్భావ టీమ్ అధ్యక్షులు పి.ఎస్.ఎన్. మూర్తి , కార్యదర్శి డి.ఎస్.ఎస్. కుమారి సభ్యులు నరసింహ మూర్తి , దేవర అప్పల రాజు , చంద్రశేఖర్ , జి. విజయలక్ష్మి , జనపరెడ్డి నాయుడు , పుట్టా శ్రీనివాస్ తో సభ్యులు పాల్గొన్నారు.

## మాడుగుల ఎక్సైజ్ సర్కిల్‌లో మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం

**మాడుగుల,సెప్టెంబర్ 27,జయ జయ హే**




మాడుగుల ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల రెన్యువల్ చేసుకోని ఐదు మద్యం దుకాణాలకు అక్టోబర్ 1లోగా దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక ఎక్సైజ్ సి ఐ ఎల్ ఉపేంద్ర తెలిపారు.మాడుగుల మండలంలో రెండు, చీడికాడ మండలంలో ఒకటి, రావికమతం మండలంలో రెండు మద్యం దుకాణాలకు ఆన్లైన్,ఆఫ్లైన్ లేదా హైబ్రిడ్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఒక దరఖాస్తుకు మూడు లక్షల రూపాయలు రుసుము చెల్లించి లాటరీలో పాల్గొనచ్చునన్నారు. అలాగే 21 ఏళ్లు నిండిన ప్రతీ వ్యక్తి ఒక మద్యం దుకాణంపై ఎన్ని దరఖాస్తులైన వేసుకొనే అవకాశం ఉందని సీఐ ఉపేంద్ర తెలిపారు. దరఖాస్తు చేయడానికి చివరి తేదీ అక్టోబర్ 1 అర్ధరాత్రి వరకు అవకాశం ఉందన్నారు.మూడో తేదీన దరఖాస్తులను పరిశీలించి,ఐదో తారీఖున జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయించడం జరిగిందన్నారు. మరింత సమాచారం కోసం 9700442005 ఫోన్ కి సంప్రదించవచ్చని సిఐ తెలిపారు.



## పుష్కరిణీ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు విరాళం

**చోడవరం,సెప్టెంబర్ 27,జయ జయ, హే**

చోడవరం స్వయంభూ శ్రీ గౌరీశ్వర స్వామి సన్నిధిలో శాసన సభ్యులు కే ఎస్ ఎన్ ఎస్ రాజు ఆధ్వర్యంలో జరుగుతున్న ఆలయ పుష్కరిణి అభివృద్ధి నిమిత్తం 1985-1986 చోడవరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పుష్కరిణి మధ్యలో నిర్మించనున్న మహాశివుని విగ్రహం ద్వాదశ జ్యోతిర్లింగం నిమిత్తం 5 లక్షలు రూపాయలు విరాళంగా ప్రకటించారు. దానిలో 2లక్షలు రూపాయలు విలువయిన ఐరన్ మెటీరియల్ విరాళంగా శాసన సభ్యులు రాజు చేతుల మీదుగా అందజేశారు.



## శ్రీ కనకదుర్గ బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి కింజరాపు

**టెక్కలి సెప్టెంబర్ 27 జయ జయహే**

పార్వతీపురం మన్యం జిల్లా శ్రీ సర్వమంగళ దేవి పీఠం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్న శ్రీ కనకదుర్గ దసరా బ్రహ్మోత్సవాల గోడపత్రిక ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు నిమ్మడ క్యాంపు కార్యాలయంలో ఆ ష్కరించారు. ప్రముఖ ఆధ్యాత్మిక నాడీ జ్యోతిష్కులు బ్రహ్మశ్రీ మురపాక కాళిదాస్ శర్మ సారధ్యంలో జరుగుతున్న పార్వతీపురం శ్రీ కనకదుర్గ బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు కు సర్వమంగళ దేవి పీఠం ప్రతినిధులు ఆహ్వానం పలికారు , ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు అట్టడ రాంప్రసాద్, సీనియర్ పాత్రికేయులు కోట రాము రెడ్డి, బచ్చల బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో దేశభక్తికి ఎన్సిసితో ఎంతో మేలు

**ఐతం కళాశాల లో ఎన్సిసి ఎంపికలు**

**టెక్కలి సెప్టెంబర్ 27 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని ఐతం కళాశాల లో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కు ఎన్సిసి ఎంపికల ప్రక్రియ నిర్వహించారు. ఆంధ్ర 14వ బెటాలియన్ కమాండర్ శశాంక్ కుష్వా , ఆర్డనరీ లెఫ్టినెంట్ బలవంత్ సింగ్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరిగింది 164 మంది విద్యార్థులు పాల్గొనగా 65 మంది విద్యార్థులను ఎన్సిసికి ఎంపిక చేశారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించడంలో ఎన్సిసి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరరావు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో సుబేదార్ ధర్మేందర్ సింగ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, ఎన్సిసి కోఆర్డినేటర్ డాక్టర్ డి విష్ణుమూర్తి, లెఫ్టినెంట్ డి మురళీమోహన్, శిక్షకులు భుజంగరావు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో గణపతి నిమజ్జనం

**నిడదవోలు జయ జయ ప్రతినిధి :**

నిడదవోలు పట్టణంలోని రజక వీధిలో నిర్వహించిన నిండు గణపతి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. పలు రోజులుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గణనాథుడిని భక్తులు కొలిచారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు.నిమజ్జనాన్ని పురస్కరించుకుని రజక వీధి నుంచి గణపతి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ఘనంగా ఊరేగించారు. డీజే సంగీతంతో యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, గణపతి నామస్మరణలు, జై బోలో గణేష్ మహారాజ్ నినాదాలతో ఊరేగింపు సాగింది. మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.ఊరేగింపు సాగిన మార్గమంతా భక్తులతో సందడిగా మారింది. గణపతి విగ్రహాన్ని దర్శించుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి, హారతులు ఇచ్చి గణనాథుడిని ప్రార్థించారు. అనంతరం నిర్ణయించిన నిమజ్జన ప్రదేశానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి గణపతి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.ఈ మహోత్సవాల విజయవంతానికి పట్టణ రజక జనసేవ సంఘం సభ్యులు, డైమండ్ యూత్ సభ్యులు సమన్వయంతో కృషి చేశారు. ఉత్సవాల నిర్వహణ, భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, నిమజ్జన ఊరేగింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సభ్యులు సేవలందించారు.గణపతి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు వచ్చే ఏడాది కూడా ఇదే ఉత్సాహంతో గణనాథుడి ఉత్సవాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించి ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని గణనాథుడిని వేడుకుంటూ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు.

# అడవివరం ప్రజా రైతు హక్కుల సాధన కమిటీ అధ్యక్షులుగా సిరిపురపు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 27, జయ జయహే :**



అడవివరం గ్రామంలో గ్రామ పెద్దలు, అఖిలపక్ష నాయకుల సమక్షంలో ఈరోజు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో "అడవివరం ప్రజా రైతు హక్కుల సాధన కమిటీ"ని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసి, కమిటీ సభ్యులను ప్రకటించారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా సిరిపురపు వరాహ నరసింహం, ప్రధాన కార్యదర్శులుగా పంచదార్ల ప్రసాద్, పాలూరు శ్రీను, లంక వరంలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కొలుసు శ్రీనివాస్, రౌతు సత్తిబాబు, సిరిపురపు సురేష్, లండా దేవి చంద్రరావు, బసన అప్పలనాయుడు, జెర్రిపోతుల నరసింహమూర్తి, మజ్జి అప్పలరమణ, అక్కిరెడ్డి శ్రీను, మజ్జి చంద్ర శ్రీనివాస్, అయ్యల సోమయాజుల మణిబాబు. కోశాధికారులుగా దాసరి రాజాజీ, కంచెర్ల సురేష్. సహాయ కార్యదర్శులుగా రంగాల అప్పలరాజు, లండా చిన్న శ్రీనివాస్, మజ్జి భీమేశ్వరరావు, సిరిపురపు చిన్నకృష్ణ, విజినిగిరి త్రినాథరావు, గెద వెంకటరమణ, తోట రమేష్, సిడగం సన్యాసప్పుడు, దాసరి పైడిరాజు, విజినిగిరి శంకర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లుగా తిరుమల పెదింటి కీర్తితేజ, పాశర్ల ప్రసాదం, తరుణ్ ఆదిత్య, కార్యవర్గ సభ్యులుగా: భోగాపురపు పైడికొండ, నరవల కొండబాబు, పల్లి అప్పలరమణ, ధనియాల అప్పలరాజు, కాటంకంటి జగదీష్, చందక అప్పలరాజు, కిలారి బుజ్జి వెంకటరమణ, పొలిటికల్ బ్యూరో సభ్యులుగా పాశర్ల ప్రసాద్, కర్రి అప్పలస్వామి, ఎర్ర వరంబాబు, మజ్జి సూరిబాబు, లంక సత్తిబాబు, కొలుసు ఈశ్వరరావు, బవిరిశెట్టి పండు, శ్రీరామ్, మేకల కాసు గోపాల్, రాచ ఆనందవర్మలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీకి పలువురు విరాళాలను ప్రకటించారు. కర్రి అప్పలస్వామి రూ. లక్ష, మజ్జి సూరిబాబు రూ. 50 వేలు, లంక సత్తిబాబు రూ. 30 వేలు, రౌతు సత్తిబాబు రూ. 10 వేలు, విరాళాలు ప్రకటించారు. కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుని కలిసి, కమిటీ చేపట్టబోయే కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలని కోరనున్నట్లు తెలిపారు. ప్రధానంగా గ్రామకంఠం సమస్యలు, పంచగ్రామాల భూ సమస్యలు మరియు రైతుల హక్కుల సాధన కోసం ఈ కమిటీ కృషి చేయనుందని నాయకులు తెలిపారు. ఈ సమావేశానికి అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ అధ్యక్షత వహించారు.




# జర్నలిస్టు సమస్యలు పరిష్కారానికి కృషి

## ఎమ్మెల్యే రాజు

**చోడవరం సెప్టెంబర్ 27 జయ జయహే**

చోడవరం నియోజకవర్గంలో నెలకొన్న జర్నలిస్టులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎం ఎస్ రాజు చెప్పారు. ఈ మేరకు అక్టోబర్ రెండో తేదీన చోడవరంలో నియోజకవర్గస్థాయి జర్నలిస్టుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ చోడవరం అసెంబ్లీ నియోజకవర్గం నూతన కార్యవర్గం ఎన్నిక చోడవరంలో నిర్వహించారు . ఈ కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కె. ఎస్.ఎన్.రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో చోడవరం ఎస్సై కార్తికేయ, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు , ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ రామచంద్రరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల కిషోర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట అప్పారావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు, జిల్లా కార్యదర్శి హనుమంతరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి స్వామి, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జోగినాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి చంద్ర రావు, చోడవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు డి. వి.ఎం. నాయుడు, నేషనల్ కౌన్సిల్ నెంబర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని విలేకరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఒక వినతి పత్రాన్ని శాసనసభ్యులు రాజు కి అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యేను ఇతర అతిథులను ఘనంగా సత్కరించారు.



# దొరబాబు దృష్టికి మాడుగుల సమస్యలు

## స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయా కమిటీ సభ్యులు

**మాడుగుల సెప్టెంబరు 27 జయ జయహే**

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు నీ ఆదివారం విశాఖ రూరల్ జిల్లా సంయుక్త కార్యదర్శి రోబ్బా మహేష్, మాడుగుల జనసేన టీమ్ జనసేన సీనియర్ నాయకులు కోర్ని శంకర్, సూరిశెట్టి లోకేష్, టౌన్ సెక్రటరీ గళ్ళ గణేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాడుగుల నియోజకవర్గశీ లో నెలకొన్న పలు సమస్యలు, పార్టీ విషయాలను ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ త్వరలో అనకాపల్లి జిల్లా జనసేన సంబందించిన 7 నియోజకవర్గల నాయకులతో మీటింగ్ ఏర్పాటు చేసి జనసేన పార్టీ తరుపున పోటి చేసే స్థానాలు మీద లోకల్ ఎన్నికల సంబంధించిన సమాచారం అందజేయడం జరుగుతుందని తెలిపారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**చోడవరం సెప్టెంబర్ 27 జయ జయహే**

చోడవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు నియోజకవర్గంలో గల నాలుగు మండలాలకు చెందిన 85 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.37,24,889/- విలువైన చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడం, అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించడం ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతగా భావిస్తున్నామని ఎమ్మెల్యే సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విస్తృతంగా అన్న సమారాధన కార్యక్రమాలు

## ప్రశాంతంగా వినాయక నిమజ్జనోత్సవాలు

**దేవరాపల్లి, సెప్టెంబర్ 27, జయ జయహే**





వినాయక నవరాత్రుల మహోత్సవ సందర్భంగా మండల కేంద్రంలోని రాజుల వీధి, గాంధీ వీధి, వేచలపు వారి కల్లాలలో అన్నసమరాధన కార్యక్రమాలు విస్తృతంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎంపీపీ కిలపర్తి భాస్కర రావు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వాలేటి నాగరాజు, సోమిరెడ్డి పేరు నాయుడు, దీవి శంకర్రావు, గవిరెడ్డి దేముడుబాబు (సింహ) బండారు అప్పలనాయుడు, గుల్లిపల్లి మురళి, బి. రామరాజు, కె.సిద్దు, కొల్లి ఈశ్వరరావు, కొల్లి సురేష్, సబ్బవరపు మాలిబాబు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

**బి.కింతాడలో**

మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న పవర్ ఆఫ్ యూత్,మరిడిమాంబ యూత్ సభ్యులకు చెరో ఐదు వేలు చొప్పున స్థానిక టిడిపి నాయకులు కడిమి నాగేశ్వరరావు పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వినాయక ఉత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువతను ప్రోత్సహించడంలో భాగంగా ఈ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు టీడీపీ నాయకులు కడిమి నాగేశ్వరరావు తెలిపారు. వినాయక వేడుకల్లో భాగంగా ఆనందోత్సాహాలతో నిమజ్జనోత్సవాలు ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు.



# పూర్వ విద్యార్థుల కలయిక

## ఉత్సాహంగా గురువులకు సన్మానం

**బుచ్చియ్యపేట జయ జయహే**

దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం దిబ్బిడి హైస్కూల్లో కలిశారు. 20 సంవత్సరాల క్రితం చదువుకున్న రోజుల్లో జరిగిన ఘటన స్మరించుకొని ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు కే. సత్యారావు,పూర్వ విద్యార్థులు శ్రీను జగన్నాధం, మాణిక్యం, అప్పారావు, హైమ, నాగు, గణేష్ తదితరులు నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు వివి.అప్పారావు, పి. అరుణ్ కుమార్, డి కాళిదాస్, జయలక్ష్మి,పద్మజ, లక్ష్మి శ్రీనివాస్, సాయి వర్మ తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నాటి గత స్మృతులను స్మరించుకున్నారు. సుమారు 100 మంది వరకు విద్యార్థులు సమావేశమయ్యారు.



# బాధితులకు అండగా ప్రభుత్వం

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధుల నుండి సహాయ సహకారాలను అందించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతగానో తోడ్పడుతున్నారని చోడవరం ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు అన్నారు. మండలంలో గల మల్లం, ఆర్ శివరాంపురం, పంగిడి పెదపూడి, రాజాం తురకలపూడి, కరక ,నీలకంతాపురం కందిపూడి కేపీ అగ్రహారం పెద్దమదిన, వడ్డాది తదితర గ్రామాలకు చెందిన బాధితులకు ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెలు సత్యనారాయణ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు తమరాన దాసు తురకలపూడి పిఎసిఎస్ అధ్యక్షులు కోట సత్యనారాయణ, కోరుకొండ రవికుమార్,ఎంవివిఎస్ నాయుడు(తాతీలు ) తదితరులు పాల్గొన్నారు.




# డిసెంబర్ 1న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

**దేవరాపల్లి, సెప్టెంబర్ 27, జయ జయహే**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా డిశంబరు 1 నిర్వహించ నున్న చలో ఢిల్లీ పార్లమెంట్ మార్చ్ ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. దేవరాపల్లిలోని వివిధ కార్మిక సంఘాలు, స్కీమ్ వర్క్ ర్లు సమావేశం ఆదివారం సిఐటియు మండల కార్యదర్శి బి.టి దొర అద్యక్షతన జరిగింది. అనంతరం అయన మాట్లా డారు. మండల, జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రం లోని పాలకులు కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె. సూరిబాబు,జి.రాము, మేరి రత్నం, యస్. మహలక్ష్మి, కె. లక్ష్మి, రమణమ్మ, గర్రెడ్డి కోటిబాబు, అప్పారావు, బి. గణేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# పరారీలో ఉన్న ముద్దాయి అరెస్టు

**చోడవరం సెప్టెంబర్ 27 జయ జయహే**

నాలుగు కేజీల గంజాయి అక్రమ రవాణా కేసులో గత రెండు సంవత్సరాలుగా పరారీలో ఉన్న ఒక ముద్దాయిని ఆదివారం చోడవరం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీసులు అందించిన వివరాలు ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎస్సై బి జోగారావు తన సిబ్బందితో చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ అవుటు గెట్ వద్ద కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం, అలుగునూర్ గ్రామానికి చెందిన అండే అజయ్,(24) అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి చోడవరం కోర్టుకు తరలించారు. దీంతో కోర్టు ముద్దాయికి 15 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు

For a pure tomorrow..
జయహే

# వహ్వా.. నాట్యకళకు జనం బ్రహ్మారధం

**రెండో రోజు నృత్యోత్సవంలో అదరగొట్టిన నృత్య ప్రదర్శనలు**

**వసుంధరా దొర స్వామికి డా.సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్, పవిత్ర కృష్ణభట్‌కు యువపురస్కారాల ప్రదానం**

**విశాఖపట్నం, సెప్టెంబరు 27, జయ జయహే :**





నాట్య ముద్రలు సమ్మోహితుల్ని చేశాయి. జనాదరణ అదరహో..! అబ్బురపరిచే హావభావాలు, నాట్య శాస్త్ర నియమావళిననుసరించి కృతులకు అనుగుణంగా లయాత్మకమైన ప్రదర్శనలు ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేశాయి. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ ఆధ్వర్యాన ప్రతిష్ఠాత్మక 'వైశాఖీ నృత్యోత్సవ్-2026' అఖిల భారత జాతీయ నృత్యోత్సవం రెండో రోజు, చివరి రోజైన ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన నృత్యాంశాలు కళా భారతి ఆడిటోరియం ప్రేక్షకులను మైమరపించాయి. ఉత్సవ సంచాలకులు బి.ఆర్. విక్రమ్ కుమార్(గౌడ్) సంచాలకత్వంలో ఈ ఉత్సవ ప్రదర్శనలు ఆద్యంతం క్రమశిక్షణతో జరుగుతున్నాయి. కర్ణాటకకు చెందిన సంగీత నాటక అకాడెమీ అవార్డు గ్రహీత డాక్టర్ వసుంధర దొరస్వామి బృందం భరతనాట్య భంగిమలతో రసహృదయ కవాటాలు తెరచి మధుర సంతకం చేశాయి. రాజస్థాన్‌కు చెందిన అఫ్‌సాన్ గుజరావత్ బృందం చక్రి జానపద నృత్య ప్రదర్శనలోని గుండె వేగాన్ని శృతి చేస్తూ చేసిన భ్రమణాలు, పరిభ్రమణాలు ప్రేక్షకుల్ని ఆనంద పారవశ్యంలో ముంచెత్తాయి. ప్రతిభావంతులైన స్థానిక కళాబృందాలకు నిర్వాహకులు కల్పించే అవకాశాలు ఈ ఏడాది రెండో రోజు ఉత్సవంలో నాట్యారాధన ఆర్ట్స్ అకాడెమీ నాట్యాచారిణి నంబాల జ్యోతి శిష్య బృందం జానపద నృత్యం, సంయుక్త మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ నాట్యాచారిణి కాకర అరుణా పరమేష్ బృందం, ఎనఎండీఏ వ్యవస్థాపక నాట్యాచారిణి కేవీ లక్ష్మి శిష్య బృందం, ఆదిత్యశ్రీ సారధ్యంలోని శ్రీకృష్ణ కళామందిర్ బృందం, , నిర్మలా నృత్య నికేతన్ నాట్యాచారిణి బి. విజయ జ్యోతి బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించి భళారే అనిపించుకున్నాయి. వెరసి ఈ రెండు రోజుల నృత్యోత్సవానికి జనం బ్రహ్మారథం పట్టారు. 1996లో వసుంధర తన పీహెచ్‌డీ పట్టా కోసం చేసిన పరిశోధన గ్రంథం ఆధారంగా ఈ నృత్య రూపకం రూపుదిద్దుకుంది. విద్వాన్ వాసుదేవన్ నంబూద్రి నట్టువాంగం నిర్వహించగా విద్వాన్ బాల సుబ్రహ్మణ్య శర్మ గాత్రంతో నవరసావిష్కారం చేశారు. మృదంగంపై విద్వాన్ గురుమూర్తి, వేణువుపై విద్వాన్ జయరామ్ కిక్కరి, వీణపై విద్వాన్ శంకర్ రామన్, రిథమ్ ప్యాడ్స్‌పై విద్వాన్ శంకర్ రామన్ చక్కటి వాద్య సహకారంతో ప్రదర్శను ఆద్యంతం ఆసక్తికరంగా నడిపించారు.



## 177వ నెల సేవా కార్యక్రమంలో పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 27, జయ జయహే**

శ్రీకాళహస్తి పట్టణంలోని నగరివీధిలో హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెలవారీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇది 177వ నెల కార్యక్రమంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ సభ్యులు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డి పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హెల్పింగ్ హాండ్స్ సంస్థ పేదలకు అందిస్తున్న సేవలను అభినందించారు. సంస్థ అధినేత మునీర్ భాషను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైనంత మేర పేదలకు సహాయం అందించాలని పిలుపునిచ్చారు. హెల్పింగ్ హాండ్స్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామిగా ఉంటానని, తన వంతు సహాయాన్ని అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరరావు, గరికపాటి రమేష్, కంఠ ఉదయ్, హరినాయుడు, బాబా ఫరీద్, సుధాల్యాబ్ హబీబ్, డైరెక్టర్ గాంధీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి శ్రేణుల మధ్య సమన్వయమే విజయానికి కీలకం



**అనకాపల్లి జయ జయహే**

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఎన్డీఏ కూటమి పార్టీల మధ్య సమన్వయాని మరింత ప్రతిష్ట చేసి క్షేత్రస్థాయిలో సమిష్ఠ కార్యాచరణతో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు పీల గోవింద సత్యనారాయణ క్రమశిక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలో నోకాంబిక దేవస్థానం సమీపంలో గల శ్రీ లక్ష్మీ సత్య గ్రాండ్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి సమన్వయ సమావేశం ఆదివారం నిర్వహించడం జరిగింది . ఈ సమావేశంలో స్థానిక శాసన సభ్యులు కొనతాల రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతబాబు అనకాపల్లి బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర రావు స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత కూటమి పార్టీల మధ్య సమన్వయం నియోజకవర్గంలో చేపట్టాల్సిన కార్యాచరణ పై విస్తృతంగా ఈ సమావేశంలో చర్చించారు ఎన్నికల ఎప్పుడు వచ్చిన ఎదుర్కొనేలా సమయత్వం చేయాలని గ్రామస్థాయి నుంచి నియోజకవర్గస్థాయి వరకు టిడిపి జనసేన బిజెపి నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని పీలా గోవింద సత్యనారాయణ దిశా నిర్దేశం చేయడం జరిగింది . స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమన్వయ కమిటీలు చురుగ్గా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయిలో అభివృద్ధి స్థానిక సమస్యలు ప్రజల అవసరాలపై సమగ్ర అవగాహన కలిగి ఉన్న అత్యంత అనుకూలమైన అభ్యర్థులను గుర్తించాలని అలగే క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పరిస్థితులు కనుగుణంగా కార్యచరణను సవరించుకోవాలని వారు సూచించారు ప్రజాప్రతినిధులు పార్టీ నాయకత్వం క్షేత్రస్థాయి శ్రేణులు మధ్య నిరంతరం సమన్వయం ఉండాలా చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో కోట మిస్ అయినను ఐక్యత సమన్వయం సమిష్టి కార్యచరణ అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు





## స్థానిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ సమాయత్తం

**శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమీక్ష**

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 27, జయ జయహే**

శ్రీకాళహస్తి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు, వేధింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పలువురు సీనియర్ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ పర్యాటక పటంలో విశాఖ

**- ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం 'వైజాగ్ వేవ్స్' వేడుకలు**

**- పర్యాటక, ఐటీ, వైద్య రంగాల హబ్‌గా నగరాభివృద్ధి**

**- జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 27, జయ జయహే :**

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ, జీవీఎంసీ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సిరిపురం ద్రోణంరాజు సర్కిల్ వద్ద ఆదివారం సాయంత్రం 'వైజాగ్ వేవ్స్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలోని అరకు, పాడేరు ఏజెన్సీ అందాల నుంచి అనకాపల్లి బౌద్ధ క్షేత్రాల వరకు పర్యాటకంగా అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విశాఖను ఐటీ, మెడికల్ టూరిజం, బీచ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వివరించారు. "ఏ ఇజం లేదు.. భవిష్యత్తంతా టూరిజం" అనే నినాదంతో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో నూతన విధానాలతో పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నామని, విశాఖను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ తిరుమల మినహా రాష్ట్రంలో అత్యధిక పర్యాటక కార్యకలాపాలు విశాఖలోనే జరుగుతున్నాయని, రాష్ట్రానికి వచ్చే విదేశీ పర్యాటకుల్లో 85 శాతం మంది వైజాగ్‌నే సందర్శిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నగరంలో 10కి పైగా ఫైవ్‌స్టార్ హోటళ్లు నిర్మాణంలో ఉన్నాయని, మేఫెయిర్, ఒబెరాయ్ వంటి సంస్థలు సెవెన్-స్టార్ వసతులతో ప్రాజెక్టులు చేపడుతున్నాయని పేర్కొన్నారు. వెస్టిన్, మారియట్, తాజ్ వంటి అంతర్జాతీయ సంస్థలు కొత్త హోటళ్లను నిర్మిస్తున్నాయని చెప్పారు. అమెరికా పర్యటనలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు, నిపుణులు విశాఖను ఇటలీలోని సుప్రసిద్ధ 'అమాల్ఫీ కోస్ట్'తో పోలుస్తూ, అత్యంత అందమైన మరియు పరిశుభ్రమైన నగరంగా ప్రశంసించారని కలెక్టర్ గుర్తుచేశారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ విశాఖ ఆధ్యాత్మిక కేంద్రంగానే కాక, మహిళలకు అత్యంత సురక్షితమైన నగరంగా నిలిచిందని పేర్కొన్నారు. స్వదేశీ పర్యాటకులతో పాటు విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షించేందుకు అంతర్జాతీయ పర్యాటక ప్రదర్శనలలో విశాఖ బీచ్ టూరిజంను ప్రత్యేకంగా ప్రమోట్ చేయాలని సూచించారు. నూతన ఎయిర్‌పోర్ట్, మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ ద్వారా అంతర్జాతీయ పర్యాటక పటంలో విశాఖను అగ్రగామిగా నిలపవచ్చని అభిప్రాయపడ్డారు.



## రాంపురంలో ఘనంగా వినాయక నవరాత్రి సంబరాలు

**పెందుర్తి, సెప్టెంబర్ 27, జయ జయహే**

పెందుర్తి మండలం రాంపురం గ్రామంలో గ్రామ మోరియా యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారిని దర్శించుకుని అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో విశాఖపట్నం మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మోరియా యూత్ సభ్యులు బాదిరెడ్డి హరీష్, జామి ఎర్రిబాబు, జామి శంకర్, అన్నశీరెడ్డి శ్రీధర్ మరియు యూత్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు




## డి పట్టా భూముల తాకట్టుపై అక్రమ రుణాలు తగదు

**సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలి సిపిఎం డిమాండ్**

**టెక్కలి సెప్టెంబర్ 27 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాలి మండలం వడ్డి తాంధ్ర గ్రామంలో డి పట్టా భూములను మార్ట్ గేజ్ చేయుటకు సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని శ్రీకాకుళం జిల్లా సిపిఎం ప్రతినిధులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. ఈ ప్రాంత డి పట్టా భూములపై ఉన్నతాధికారులు సమగ్ర సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. టెక్కలి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో దస్తవేజు నెంబర్లు 2227,2004, 238/2004,1552/2005 భూముల ద్వారా 11 లక్షల రూపాయలు ను ముగ్గురు వ్యక్తులు అక్రమంగా రుణం పొందారని సమాచార హక్కు చట్టం పరిరక్షణ సమాఖ్య వేదిక జిల్లా అధ్యక్షులు అనపాన షణ్ముఖరావు, దువ్వాడ విజయ్ కుమార్, తెలిపారు. అక్రమంగా డి పట్టా భూములపై రుణాలు పొందిన ముగ్గురు వ్యక్తుల తో పాటు ఇందుకు బాధ్యులైన అధికారులపై సమగ్ర దర్యాప్తు చేసి క్రిమినల్ కేసులు బనాయించాలని, వీరంతా డిమాండ్ చేశారు. మండల భూములపై సమగ్ర దర్యాప్తు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సామ భాస్కరరావు, భుజంగరావు, ఇచ్ఛాపురం రమణారావు, కప్ప లక్ష్మి, సాయిరాం, అన పాన కూర్మానాద్ , పలువురు ఈ మేరకు జిల్లా పోలీస్ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## కిడ్నీ దాత కోసం 20 ఏళ్ల యువకుడి ఎదురుచూపులు

**10 ఏళ్లుగా డయాలసిస్‌పైనే జీవనం.. తల్లి కన్నీటి వేడుకోలు**

**తొట్టంబేడు, సెప్టెంబర్ 27, జయ జయహే**



తొట్టంబేడు: కిడ్నీ వ్యాధితో పదేళ్లుగా బాధపడుతున్న 20 ఏళ్ల యువకుడు కిడ్నీ దాత కోసం ఎదురుచూస్తున్నాడు. తొట్టంబేడు మండలం పొయ్య ఎస్సీ కాలనీకి చెందిన గంధం ఆకాష్ (20)కు 2016లో రెండు కిడ్నీలు విఫలమయ్యాయి. అప్పటి నుంచి డయాలసిస్‌పైనే జీవనం సాగిస్తున్నాడు. ఏలూరు, తిరుపతిలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో రోజు విడిచి రోజు డయాలసిస్ చేయించుకుంటున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో కిడ్నీ మార్పిడికి అవసరమైన ఖర్చును భరించలేని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి ఆకాష్‌కు పెన్షన్ మంజూరు చేయించారు. అయితే కిడ్నీ మార్పిడి అవసరమని కుటుంబ సభ్యులు తెలిపారు. "ఒక కిడ్నీ దానం చేసి నా బిడ్డను బతికించండి" అంటూ తల్లి గంధం గీత దాతలకు కన్నీటి వేడుకోలు చేస్తున్నారు. ఆకాష్‌కు కిడ్నీ దానం చేసేందుకు ముందుకు వచ్చే దాతలు 8686942260, 9100748746 నంబర్లలో సంప్రదించాలని కుటుంబ సభ్యులు కోరారు.

## కుమారస్వామి తిప్ప వద్ద నిర్మాణ పనులు అడ్డుకున్నాం

**శ్రీకాళహస్తీశ్వర ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్**

**శ్రీకాళహస్తి (జయ జయహే )**



శ్రీకాళహస్తి స్థానిక కుమార స్వామి తిప్ప వద్ద కొందరు వ్యక్తులు కొండను ఆక్రమించి నిర్మాణ పనులు చేపడుతున్నారనే సమాచారం అందిన వెంటనే ఆలయ అధికారులను సంఘటనా స్థలానికి పంపించి, నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయిం చినట్లు శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ తెలిపారు. ఈ విషయంపై అనంతరం ఎమ్మార్వో, ఆర్డీవో సమక్షంలో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. ఆలయ భూమిని పరిరక్షించేందుకు కంచె ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. ఆలయ భూముల పరిరక్షణ విషయంలో తమకు సమాచారం అందిన వెంటనే స్పందించి, అధికారుల ద్వారా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. సంబంధిత ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలోకి వచ్చి నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ అన్నారు. ఆలయానికి సంబంధించిన విషయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, అన్ని చర్యలు పూర్తయిన తర్వాత ఆలయంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు నాగరాజు, ప్రత్యేక ఆహ్వానితురాలు చాగణం శైలజ తదితరులు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాల గోడ పత్రిక ఆవిష్కరణ

**అనకాపల్లి జయ జయహే**



అనకాపల్లి గవరపాలెం శతకం పట్టు వద్ద వేంచేసి ఉన్న శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా నవరాత్రి మహోత్సవాల ఉత్సవాల విశేషాలను ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ మీడియా సమావేశంలో మాట్లాడుతూ వచ్చేనెల 11 నుంచి 20వ తేదీ వరకు అమ్మవారి దసరా నవరాత్రి మహోత్సవాలు ఈ సంవత్సరం మరింత అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రిక కరపత్రాలను ఆదివారం ఆలయం వద్ద ఆలయ పెద్దలు కమిటీ సభ్యులు కొణతాల మురళీకృష్ణ అధ్యక్షతన మీడియా సమావేశంలో ఆవిష్కరించడం జరిగింది కాగా ఇప్పటికే దసరా ఉత్సవాల సందర్భంగా శతకం పట్టు వద్ద కనకదుర్గ అమ్మవారి ఆలయ ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయడం జరిగింది ఆలయానికి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేయడం జరిగింది అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ శాశ్వత చైర్మన్ నాయుడు ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ ఉత్సవ పూర్వపు చైర్మన్ దాడి జై వీర్ నూతన ఉత్సవ కమిటీ చైర్మన్ మురళీకృష్ణ గౌరీ పరమేశ్వర ఉత్సవ చైర్మన్ కొనసాల సంతోష్ అప్పారావు నాయుడు ఈ సమావేశంలో పాల్గొనడం జరిగింది గత తొమ్మిదేళ్లుగా అమ్మవారి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ ఏడాది కూడా అనేక కార్యక్రమాలతో అత్యంత వైభవంగా ఉత్సవాల నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మీడియా సమావేశంలో తెలియజేయడం జరిగింది అనకాపల్లి ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో మరియు అధికారులు సహకారంతో సాంస్కృతిక సామాజిక ఆధ్యాత్మిక కార్యక్రమాల కలయిక గా ఉత్సవాలను కన్నుల పండుగ నిర్వహిస్తున్నట్లు అమ్మవారి ఆలయం నుంచి దసరా నవరాత్రి తొలి రోజు రథయాత్ర ప్రారంభిస్తున్నట్టు అలాగే ప్రతిరోజు 3000 మంది భవానీలకు భిక్ష ఏర్పాటు చేశామని సుమారు 7500 మందికి వాయినాలు ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు పారిశుద్ధ కార్మికులకు విద్యార్థులకు పుస్తకాలు ఒక బ్యాగులు అందజేస్తున్నామని అక్టోబర్ 20న దసరా రోజు జరుగు అమ్మవారి తిరుగు రథోత్సవ జాతరను 18 జానపద కళారూపాలతో 9 భారీ స్టేజీలతో అత్యంత ఘనంగా పట్టణ పురవీధుల గుండా భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నామని అన్నారు భక్తులు పెద్ద సంఖ్యలో నవరాత్రి తొమ్మిది రోజులు అమ్మోరు ఆలయానికి విచ్చేసి తీర్థప్రసాదాలు సేకరించాలని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని వారు కోరడం జరిగింది

# ఘనంగా అల్లూరి యూత్ గణనాథుని శోభాయాత్ర





**ముంచంగిపుట్టు, (జయ జయహే):**

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ముంచంగిపుట్టు స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 11 రోజుల పాటు గణనాథునికి ప్రత్యేక పూజలు, భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆదివారం శోభాయాత్రను ఘనంగా చేపట్టారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అల్లూరి యూత్ సభ్యులు భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

**డీజే సౌండ్.. డప్పుల మోతతో సందడిగా శోభాయాత్ర**

ఆదివారం నిర్వహించిన శోభాయాత్రలో ముంచంగిపుట్టు నాలుగు రోడ్ల కూడలి నుంచి గణనాథుని ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి భారీ ఊరేగింపుగా తీసుకెళ్లారు.

చిన్నా పెద్దా కలిసి.. ఉత్సాహంగా నృత్యాలు

శోభాయాత్రలో చిన్నారులు, యువత, పెద్దలు అనే తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

మత్స్యగెడ్డలో గణనాథుని నిమజ్జనం

నాలుగు రోడ్ల కూడలి నుంచి ప్రారంభమైన శోభాయాత్ర గ్రామంలోని పలు ప్రాంతాల మీదుగా కొనసాగింది. అనంతరం భక్తులు, అల్లూరి యూత్ సభ్యులు గణనాథుని ప్రతిమను మత్స్యగెడ్డకు తరలించి భక్తిశ్రద్ధల మధ్య నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, యువత పాల్గొని గణనాథుని శోభాయాత్రను విజయవంతం చేశారు. గణపతి బప్పా మోరియా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యా" అంటూ భక్తులు నినాదాలు చేస్తూ గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు.

# ఏపీకే ఫైల్ తెరిస్తే.. ఖాతా ఖాళీ!

**(ప్రతాప్)**




సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త ఎత్తుగడతో సామాన్యులను మోసం చేస్తున్నారు. ఇప్పటివరకు ఓటీపీలు, నకిలీ లింకులు, డిజిటల్ అరెస్టుల పేరుతో మోసాలకు పాల్పడిన నేరగాళ్లు ఇప్పుడు 'ఏపీకే' ఫైళ్లను ఆయుధంగా మార్చుకుంటున్నారు. ట్రాఫిక్ చలాన్, గ్యాస్ బిల్లు, డేటింగ్ యాప్ పేరుతో వచ్చిన ఫైళ్లను నమ్మి డౌన్‌లోడ్ చేసిన ముగ్గురు చండీగఢ్ వాసులు మొత్తం రూ.6.13 లక్షలకు పైగా కోల్పోయిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది.

పోలీసుల వివరాల ప్రకారం, హల్లోమజ్రాకు చెందిన బల్బీర్ సింగ్‌కు ట్రాఫిక్ చలాన్‌కు సంబంధించినదిగా చెబుతూ ఒక ఏపీకే ఫైల్ వచ్చింది. నిజమైన చలాన్ సమాచారమేనని భావించిన ఆయన దాన్ని మొబైల్‌లో డౌన్‌లోడ్ చేశారు. ఆ తర్వాత ఫోన్‌పై సైబర్ నేరగాళ్లకు నియంత్రణ లభించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం ఆయన బ్యాంకు ఖాతాల నుంచి పలు లావాదేవీల ద్వారా రూ.3,99,512 మాయమయ్యాయి.

మరో ఘటనలో బెహ్లానాలోని ఐటీబీపీ కాంపోజిట్ ఆసుపత్రికి చెందిన సరోజ్ కుమార్ పర్హీకి పెండింగ్ గ్యాస్ బిల్లు పేరుతో ఓ ఏపీకే ఫైల్ పంపారు. దాన్ని ఇన్‌స్టాల్ చేసిన తర్వాత ఆయన మొబైల్ భద్రత దెబ్బతిని, బ్యాంకు ఖాతా నుంచి రూ.54,883 అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.




మూడో ఘటనలో ఓ మహిళకు తెలియని నంబర్ నుంచి వాట్సాప్‌లో డేటింగ్ యాప్‌గా పేర్కొంటూ ఏపీకే ఫైల్ వచ్చింది. దాన్ని ఇన్‌స్టాల్ చేసిన కొద్దిసేపటికే ఫోన్ సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లినట్లు భావిస్తున్నారు. అనంతరం ఆమె ఖాతా నుంచి రూ.1,59,072 మాయమైంది.

మూడు ఘటనలపైనా చండీగఢ్ సైబర్ క్రైమ్ పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లు, లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేయవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ట్రాఫిక్ చలాన్, విద్యుత్, గ్యాస్ బిల్లు వంటి పేర్లతో వచ్చిన సందేశాలను సంబంధిత అధికారిక యాప్ లేదా వెబ్‌సైట్‌లోనే నిర్ధారించుకోవాలని సూచిస్తున్నారు. ఒక్క అనుమానాస్పద ఫైల్‌పై చేసిన క్లిక్.. ఫోన్‌నే కాదు, క్షణాల్లో బ్యాంకు ఖాతానూ నేరగాళ్ల చేతుల్లో పెట్టే ప్రమాదం ఉందని ఈ ఘటనలు మరోసారి హెచ్చరిస్తున్నాయి.



## లాఠీచార్జీకి నిరసనగా

# కొవ్వొత్తులతో నిరసన

**చలో విజయవాడలో స్వర్ణ వార్డు కార్యదర్శులపై లాఠీచార్జికి శ్రీకాళహస్తిలో నిరసన సెగ**

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 27, జయ జయహే**

శ్రీకాళహస్తి: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు విజయవాడలో నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లిన స్వర్ణ వార్డు కార్యదర్శులపై జరిగిన లాఠీచార్జీకి నిరసనగా శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయం వద్ద వార్డు కార్యదర్శులు కొవ్వొత్తులతో మౌన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వారిపై లాఠీచార్జీ చేయడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను, డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా విని పరిష్కరించాల్సిన సమయంలో లాఠీలతో సమాధానం చెప్పడం ఏమిటని వారు ప్రశ్నించారు. తమపై జరిగిన చర్యకు నిరసనగా కొవ్వొత్తులు చేతబట్టి మౌనంగా నిరసన తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి స్వర్ణ వార్డు కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని, తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో స్వర్ణ వార్డు కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఆపరేషన్ త్రిశూల్

**అనకాపల్లి జయ జయహే**

రాష్ట్రంలో ప్రజా భద్రతను పటిష్టం చేయడమే ధ్యేయంగా పోలీస్ శాఖ మరియు జిల్లా యంత్రాంగం సంయుక్తంగా చేపట్టిన ప్రత్యేక వ్యూహాత్మక కార్యక్రమం ఆపరేషన్ త్రిశూల్ ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత మహిళలు చిన్నారుల రక్షణ మత్తు పదార్థాల నిర్మూలన అనే మూడు ప్రధాన అంశాలపై సంప్రదిత శాఖల ఉన్నతాధికారులతో జిల్లా స్థాయి సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశాలు మేరకు ప్రతి నెల నిర్వహించాయి ఉమ్మడి సమీక్షలకు త్రిసూల్ గా నామకరణం చేశామని జిల్లా నివేదికల ఆధారంగా రాష్ట్ర స్థాయిలో పురోగతిని పర్యవేక్షిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు జిల్లాలో రోడ్డు ప్రమాదాల ప్రాణ నష్టాన్ని నివారించేందుకు విస్తృత స్థాయిలో ఎన్ఫోర్స్మెంట్ నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు తరచూ ప్రమాదాలు జరిగే సమస్య త్మక ప్రాంతాలు బ్లాక్ స్పాట్స్ వద్ద హైవే మొబైల్ వాహనాలు నిలిపి విజిబుల్ పోలీస్ సింగ్ పెంచుతున్నామని దీనివల్ల అతివేగానికి అడ్డు కట్టబడటం పాటు ప్రయాణికుల ట్రాఫిక్ క్రమశిక్షణ పెరుగుతుందని ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిపై ప్రత్యేక డ్రైవ్లు చేపట్టి భారీ జరీ మానాలు విధించడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు ప్రమాదాల్లో ద్విచక్ర త్రి చక్ర వాహనాలు ఉంటున్నాయని 25, 35 ఏళ్లు యువత ఎక్కువగా బాధితులుగా మారుతున్నారని అలాంటి వారిని గుర్తించిన నేపథ్యంలో ఉదయం 9 నుండి 12 గంటలు సాయంత్రం 6 నుండి 12 గంటలు సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పీడ్ లేజర్లు బాడీ వార్న్ కెమెరాలు ద్వారా తనిఖీలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు పోలీసు ఆర్ అండ్ బి, ఎన్ హెచ్, పంచాయతీరాజ్ అధికారులతో కూడిన సంయుక్త ఆడిట్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించి వారం రోజుల సరిదిద్దు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది . బ్లాక్ స్పాట్స్ వద్ద సరైన లైటింగ్ హెచ్చరిక బోర్డులు రంబులు స్ట్రిప్స్ సీసీటీవీలు 108 అంబులెన్స్ తో పాటు అన్ని సిహెచ్సిలో సి ఎస్ ఆర్ నిధులతో అందుబాటులో ఉంచిన అడ్వాన్సుడ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు ప్రమాద బాధితులకు నగదు రహిత అత్యవసర చికిత్స అందించే ప్రైమ్ మినిస్టర్స్ రోడ్డు యాక్సిడెంట్ విక్టిమ్స్ క్యాష్ లెస్ ట్రీట్మెంట్ స్కీము సంబంధించిన పోస్టర్లు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్పీ ఉన్నతాధికారులు ఆవిష్కరించారు. అభయ క్యూఆర్ కోడ్ అండ్ శక్తి టీమ్స్ మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన అభయ క్యూఆర్ కోడ్ పై విస్తృత అవగాహన కల్పించడంతోపాటు బస్టాండ్లు ఆటోలు రద్దీ ప్రదేశాల్లో స్టిక్కర్లు అతికింపు కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు శక్తి టీములు గ్రామ వార్డు మహిళా పోలీసుల ద్వారా నిరంతర నిగు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కల్పించి బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని సూచించారు ఈ సంవత్సరం 17 గంజాయి కేసులను నమోదు చేసి దాదాపు 1 428 కిలోల గంజాయి 18'92 కిలోల హాశిష్ ఆయన స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు పదేపదే నేరాలకు పాల్పడి వారిపై చట్టాన్ని కఠినంగా అమలు చేస్తుండడంతో నేరస్థులు జిల్లా విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన సదస్సులు ఈగల్ యాక్టివిటీస్ నిర్వహిస్తున్నామని ప్రతి పోలీస్ స్టేషన్ కు టెస్టింగ్ కిట్లు అందజేసే ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్టు మత్తు పదార్థాలు సమాచారం ఉన్నవారు 19 72 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# ఈ పండు ఆరోగ్యానికి మేలు

**సాధారణంగా పండు ఏదైనా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే పండువల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ ప్రయోజనాలు కొన్ని పండ్లలో ఎక్కువగా, కొన్ని పండ్లలో తక్కువగా ఉంటాయి. ఇలా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉండే పండ్లలో పంపర పనస ఒకటి.**



సాధారణంగా పండు ఏదైనా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే పండువల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ ప్రయోజనాలు కొన్ని పండ్లలో ఎక్కువగా, కొన్ని పండ్లలో తక్కువగా ఉంటాయి. ఇలా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉండే పండ్లలో పంపర పనస ఒకటి. ఈ పంపర పనస పండు అచ్చం బత్తాయిని పోలి, పరిమాణంలో కొంత పెద్దగా ఉంటుంది. పండు లోపల నిమ్మ, నారింజ, బత్తాయిలాగానే తొనలు ఉంటాయి. సిట్రస్ జాతికి చెందిన ఈ పండు కలర్ ఫుల్‌గా కనిపించడమే కాకుండా మంచి ఆరోగ్య లక్షణాలను కూడా కలిగి ఉంది. పంపర పనస పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం



**రోగ నిరోధక శక్తి వృద్ధి**

పంపర పనసలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి ఈ పండు తినడంవల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ ఈ పండును తింటుంటే అనారోగ్యాలు దరిచేరవు.

**గుండెకు మేలు**

పంపర పనసలో పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంది. రక్తపోటు అదుపులో ఉంటే గుండె సంబంధ సమస్యలు సహజగానే అదుపులో ఉంటాయి. ఇక ఈ పండులోని ఫైబర్ కంటెంట్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండెపోటు ప్రమాదాన్ని నియంత్రిస్తుంది.

**జీర్ణశక్తి మెరుగు**

జీర్ణక్రియకు సాయపడే జీర్ణ ఎంజైమ్‌లు కూడా పంపర పనసలో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఈ పండు తరచూ తీసుకుంటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఈ పండులోని ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. దాంతో జీర్ణవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుంది.

**బరువు అదుపులో**

పంపర పనస రుచిలో తియ్యగా ఉన్నప్పటికీ దీనిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కొవ్వు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉంటుంది. తీపి తినాలనే వారికి ఇది తృప్తిని ఇస్తుంది. అతిగా తినడాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలని అనుకునేవారు పంపర పనస తీసుకుంటే మంచి ప్రయోజనాలు ఉంటాయి.

**చర్మం ఆరోగ్యం**

ఈ పండులో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంవల్ల చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ముడతలు, గీతలు లాంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సాయపడుతాయి. ఈ పండును రెగ్యులర్‌గా తీసుకుంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా ప్రకాశవంతమైన చర్మం సొంతమవుతుంది.

# గ్లోయింగ్ స్కిన్ కావాలా?

## ఈ అలవాట్లను అలవర్చుకోండి

నటీమణులను చూసి మీరు కూడా ఇలాగే ఆలోచిస్తారా?.. నాకు కూడా ఆమెలా మెరుస్తున్న చర్మం కలిగి ఉంటే బాగుండేదని. అవును అయితే, ఈ రోజు మనం అటువంటి మెరిసే చర్మాన్ని పొందే రహస్యాన్ని మీకు చెప్పబోతున్నాము. దీని కోసం మీరు ఎటువంటి ఖరీదైన చర్మ సంరక్షణ ఉత్పత్తికి డబ్బు ఖర్చు చేయనవసరం లేదు లేదా ఖరీదైన ఫేషియల్ చేయించుకోవలసిన అవసరం ఉండదు. మెరిసే చర్మం కలిగి ఉండాలంటే చర్మ సంరక్షణ లేదా మేకప్ మాత్రమే చేయాల్సిన అవసరం లేదు. మీ రోజువారీ అలవాట్లు మీ చర్మాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. కాబట్టి, మీ చర్మానికి మేలు చేసే కొన్ని అలవాట్లను మీ జీవనశైలిలో చేర్చుకోవాలి.

మెరిసే చర్మం కోసం ఆరోగ్యకరమైన అలవాట్లు

వ్యాయామం-ప్రతిరోజూ కొంత సమయం పాటు వ్యాయామం చేయడం వల్ల మీ చర్మానికి చాలా మేలు జరుగుతుంది. ఇలా చేయడం వల్ల చర్మంలోని మురికి చెమట ద్వారా బయటకు వచ్చి రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీని వల్ల చర్మం మెరుస్తూ కనిపిస్తుంది.

సమయానికి నిద్రించండి-మీ రోజువారీ నిద్ర, మేల్కొనే సమయాన్ని నిర్ణయించుకుని దానిని అనుసరించండి. సెలవుల్లో కూడా ఒకే సమయంలో నిద్రించడానికి, మేల్కొలపడానికి ప్రయత్నించండి. ఇది మీ నిద్రను కూడా నిర్ధారిస్తుంది. మీ శరీరం సిర్కాడియన్ రిథమ్ నిర్వహించబడుతుంది. ఇలా చేయడం వల్ల చర్మం మెరుస్తుంది. మొటిమలు తగ్గుతాయి.

ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినండి- మన ఆహారం మన చర్మంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. కాబట్టి మీ



ఆహారంలో పచ్చి కూరగాయలు, పండ్లు, పెరుగు, చేపలు మొదలైన వాటిని చేర్చుకోండి. మీ ఆహారంలో విటమిన్ సి, ఇ, ప్రొటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే ఆహారాన్ని తప్పకుండా చేర్చుకోండి.

నీరు తాగండి-ప్రతిరోజూ సరైన మొత్తంలో నీరు తాగండి, తద్వారా మీ శరీరం డీహైడ్రేషన్ చెందదు. డీహైడ్రేషన్ కారణంగా మీ చర్మం పొడిగా, నిర్జీవంగా కనిపిస్తుంది.




# ఈ లక్షణాలు కనిపిస్తే అలర్ట్ అవ్వండి!

ప్రస్తుతం చాలా మంది మధుమేహంతో బాధపడుతున్నారు. అధిక రక్తంలో గ్లూకోజ్ స్థాయిని మధుమేహం అంటారు. ఇది శరీరం ఇన్సులిన్ హార్మోన్‌ను తగినంతగా ఉత్పత్తి చేయకపోవడం లేదా ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించలేకపోవడం వల్ల సంభవించే దీర్ఘకాలిక వ్యాధి. మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవడానికి సమయానికి మందులు తీసుకోవడం చాలా అవసరం. విపరీతమైన ఆకలి కారణంగా :మధుమేహ వ్యాధిగ్రస్తుల శరీర కణాలకు గ్లూకోజ్ అందుబాటులో ఉండదు . ఇది శక్తి కోసం మెదడుకు ఆకలి సంకేతాలను పంపుతుంది, మీరు ఎంత తిన్నా మళ్లీ ఆకలితో ఉంటుంది.

దాహం : రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు, అదనపు గ్లూకోజ్ మూత్రంలోకి ప్రవేశిస్తుంది. ఇది రక్తంలోని నీటి శాతాన్ని తొలగిస్తుంది. ఇది నిర్జలీకరణానికి దారితీసే అధిక దాహానికి దారితీస్తుంది.

మూత్ర విసర్జన : మూత్రంలో అదనపు గ్లూకోజ్‌ను ఫిల్టర్ చేయడానికి మూత్రపిండాలకు ఎక్కువ నీరు అవసరం. ఇది తరచుగా మూత్రవిసర్జనకు దారితీస్తుంది.

బరువు తగ్గడం : కణాలు గ్లూకోజ్ పొందలేనప్పుడు, శరీరం శక్తి కోసం కొవ్వు ,కండరాలను విచ్ఛిన్నం చేయడం ప్రారంభిస్తుంది. ఇది త్వరగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

చేతులు లేదా కాళ్లలో తిమ్మిరి : ఎక్కువ కాలం రక్తంలో చక్కెరను పెంచడం వల్ల నరాలు దెబ్బతింటాయి. దీన్ని డయాబెటిక్ న్యూరోపతి అంటారు. ఇది జలదరింపు, తిమ్మిరి , నొప్పిని కలిగిస్తుంది.

అస్పష్టమైన దృష్టి :రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండటం వలన కంటి చూపులో మార్పులకు కారణం కావచ్చు. ఇది దృష్టిని అస్పష్టం చేస్తుంది. ప్రతిగా, ఇది రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతీయడం ద్వారా సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది.

గాయం : గ్లూకోజ్ స్థాయిలను పెంచుతుంది, రక్త ప్రసరణ , రోగనిరోధక పనితీరును దెబ్బతీస్తుంది. ఇది అల్సర్లు, గాయాలు , ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. ముఖ్యంగా చర్మం, చిగుళ్ళు, మూత్ర నాళాలపై ప్రభావం చూపుతుంది.




# విటమిన్-డి సప్లిమెంట్స్‌తో ఆరోగ్య ప్రయోజనాలివే

ఆర్యోగ్యకరమైన ఎముకలు, పళ్లు, మెరుగైన రోగనిరోధక శక్తి సహా పలు శారీరక విధులు నిర్వర్తించేందుకు విటమిన్ డీ అత్యంత కీలకం. సూర్యరశ్మి తగిలినప్పుడు మన శరీరం సహజంగానే విటమిన్ డీని తయారుచేసుకుంటాయి. కొన్ని ఆహార పదార్థాలు, సప్లిమెంట్స్ ద్వారా కూడా విటమిన్ డీని పొందవచ్చు. క్యాల్షియంను శరీరం సరిగ్గా సంగ్రహించాలంటే విటమిన్ డీ అత్యంత అవసరం.

ఎండకు ఎక్స్‌పోజ్ కానివారు, ఎత్తైన ప్రాంతాల్లో ఉండేవారు, విటమిన్ డీ అధికంగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోని వారిలో విటమిన్ డీ లోపం తలెత్తుతుంది. విటమిన్ డీ లోపంతో బాధపడేవారు వైద్యుల సలహా మేరకు విటమిన్ డీ సప్లిమెంట్స్‌ను తీసుకోవాలి. ఇక విటమిన్ డీ సప్లిమెంట్స్ తీసుకోవడం ద్వారా ఎముకల ఆరోగ్యం మెరుగవుతుంది.

విటమిన్ డీ లోపిస్తే శరీరం తగినంత క్యాల్షియంను గ్రహించని కారణంగా ఎముకలు బలహీనమవుతాయి. విటమిన్ డీ ఎముకల సాంద్రత, బలాన్ని పెంచి ఆస్టియోపొరోసిస్, ఫ్రాక్చర్‌ల వంటి వాటిని నిరోధిస్తుంది. విటమిన్ డీ తగినంతగా ఉంటే రోగనిరోధక శక్తి మెరుగవుతుంది. ఇమ్యూనిటీ పెరగడం ద్వారా కోల్డ్, ఫ్లూ, ఇన్ఫెక్షన్స్ వంటి ముప్పు తగ్గుతుంది. ఇక విటమిన్ డీ సప్లిమెంట్స్ ద్వారా చేకకూరే ప్రయోజనాలు పరిశీలిస్తే..

ఎముకల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి మెరుగుదల
భావోద్వేగాల నియంత్రణ, గుండె ఆరోగ్యం, కండరాల పనితీరు మెరుగు
బరువు నియంత్రణ, మధుమేహ ముప్పునకు చెక్, మెదడు ఆరోగ్యం మెరుగు
చర్మ సంరక్షణ

# స్నేహమే శాశ్వతం



ఇద్దరు మిత్రులు ఎడారి గుండా నడుస్తున్నారు. అలా పోతూ ఉండగా ఇద్దరి మధ్య ఏదో విషయంలో వాదులాట జరిగింది. కోపంలో ఒకడు తన మిత్రుణ్ని చెంపమీద కొట్టాడు. అయితే, చెంపదెబ్బ తిన్న వ్యక్తి 'నా మిత్రుడు నన్ను కొట్టడంతో, ఈ రోజు నా మనసు గాయపడింది' అని ఇసుక మీద రాశాడు. ఆ తర్వాత వాళ్లు యథావిధిగా తమ నడక కొనసాగించారు. కొంచెం సేపటికి ఓ ఒయాసిస్సు దగ్గరికి చేరుకున్నారు. అందులో స్నానం చేసి అలసట తీర్చుకోవాలని అనుకున్నారు. ఇంతలో చెంపదెబ్బ తిన్న మిత్రుడు ఒయాసిస్సులో మునిగిపోతున్నాడు. అంతే అతని మిత్రుడు అంతకుముందటి సంఘటనను ఏమీ పట్టించుకోకుండా తన స్నేహితుణ్ని ఆపద నుంచి కాపాడాడు. ప్రాణభిక్ష పెట్టాడు. ఒయాసిస్సు నుంచి బయటికి వచ్చిన తర్వాత 'ఈ రోజు నా ప్రాణస్నేహితుడు నన్ను రక్షించాడు' అని చెంపదెబ్బ తిన్న వ్యక్తి రాతిమీద చెక్కాడు. అప్పుడు రెండో వ్యక్తి తన స్నేహితుడు చేసినదానికి ఆశ్చర్యపోయాడు. "నేను కొట్టిన విషయాన్నేమో ఇసుకమీద రాశావు. మరిప్పుడేమో నేను కాపాడిన విషయాన్ని రాయి మీద చెక్కావు. ఎందుకు?" అని ప్రశ్నించాడు. అప్పుడు చెంపదెబ్బ తిన్న వ్యక్తి.. "మన మిత్రులెవరైనా అనుకోకుండా మనల్ని గాయపరిస్తే, ఇసుక మీద రాస్తే ఆ బాధ తీరిపోతుంది. విషయం గాలికి కొట్టుకుపోతుంది. అదే సాయం చేసినప్పుడు మాత్రం ఎప్పటికీ గుర్తుండేలా శిల మీద చెక్కాలి. అప్పుడే మిత్రుడి గొప్పతనం, అవసరం ప్రపంచానికి తెలిసి వస్తుంది" అని బదులిచ్చాడు. ఈ స్నేహితుల దినోత్సవం సందర్భంగా మనం కూడా మిత్రులతో తలెత్తిన విభేదాలు మర్చిపోదాం. మంచిని మాత్రమే గుర్తుంచుకుందాం. స్నేహాన్ని శాశ్వతం చేసుకుందాం.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com